1-10Pg1exHMNWJQERP.qxd OK:1-10Pg1exHMNWJQERP.qxd 1/1/02 7:22 AM Page 1

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
శ్రీకాకుళం

Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

1-10-2026
గురువారం సంపుటి: 32 సంచిక: 242
పేజీలు: 16
వెల: 6.50



# పంటలకు మద్దతు ధర పెంపు

● రైతులకు మోడీ సర్కార్ తీపి కబురు ● కుసుమకు అత్యధికంగా రూ.675
● ఆవాలు రూ.413, గోధుమకు రూ.25 ● 3,715 లక్షల టన్నులకు పెరిగిన గోధుమ సేకరణ ● ఆరు రబీ పంటలకు రూ.8.36 లక్షల కోట్ల మద్దతు ధర

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఓ వైపు ఎల్‌నినో.. ఇంకోవైపు తీవ్ర వర్షాభవకారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో మోడీ సర్కార్ తీపి కబురు చెప్పింది. రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి అన్ని రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రబీ పంటల్లో కుసుమ మద్దతుధరను అత్యధికంగా క్వింటాల్‌పై రూ.675 పెంచారు. ఆ తర్వాత ఆవాలకు రూ.413 పెంపు ప్రకటించారు. మసూర్‌పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున ఎంఎస్‌పి పెంచారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఈ పెంపు చేసినట్లు కేంద్రం తెలిపింది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 1.5 రెట్ల స్థాయిలో ఎంఎస్‌పి ఉండేలా చూడాలన్న 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇటీవలి కాలంలో తృణధాన్యాలతో పాటు పప్పులు, నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం ఎక్కువ మద్దతు ధర అందిస్తోంది. 2014-15 నుంచి 2025-26 మధ్య గోధుమల సేకరణ 3,715 లక్షల టన్నులకు పెరిగింది. 2004-05 నుంచి >>2



# ఆసియా క్రీడల్లో ‘పసిడి’ పంట



## ఒకే రోజు నాలుగు స్వర్ణాలు
## ఆర్చరీ, షూటింగ్‌లో రాణింపు
### బాక్సింగ్, రెజ్లింగ్‌లో నాలుగు కాంస్యాలు
### భారత్‌కు మొత్తం 60 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడలు 2026లో ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌లలో భారత్ అత్యంత విజయవంతమైన రోజును ఆస్వాదించింది. నాలుగు స్వర్ణ పతకాలతో అద్భుత విజయాన్ని సాధించింది. మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్, పురుషుల టీమ్‌ఈవెంట్లలో ఆర్చరీలో భారత్ హ్యాట్రిక్ స్వర్ణా >>2



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఖర్గే, సోనియా, రాహుల్ తదితరులు

# ఇసిపై రణభేరి ‘సేవ్ డెమొక్రసి మార్చ్’

## రేపటి నుంచి ఇండియా కూటమి దేశవ్యాప్త ఆందోళన
### 6న ఇసి కార్యాలయం ముట్టడి
### కార్యాచరణ ప్రకటించిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే
### కేంద్రం, ఇసి ముందుకు 6 డిమాండ్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో చోటు చేసుకున్న అవకతవకలపై విపక్ష ‘ఇండియా’ కూటమి తీవ్రస్థాయి పోరాటానికి కార్యాచరణ ప్రకటించింది. బుధవారం ఢిల్లీలో సమావేశమైన కూటమి అగ్రనేతలు భవిష్యత్ ఉద్యమ ప్రణాళికపై కీలక తీర్మానాలు ఆమోదించారు. సమావేశం అనంతరం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివరాలను వెల్లడించారు. అక్టోబరు 2వతేదీ మహాత్మాగాంధీ జయంతి నుంచి అక్టోబరు 8 వరకు దేశవ్యాప్తంగా ‘సేవ్ డెమొక్రసీ మార్చ్’ నిర్వహిస్తున్నట్లు ఖర్గే ప్రకటించారు. దేశంలోని ప్రతి జిల్లా కేంద్రంలో ఈ మార్చ్ జరుగుతుందని, అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట విపక్ష శ్రేణులు భారీ ఎత్తున ధర్నాలు చేపడతాయని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ అక్టోబరు 6వ తేదీన కూటమికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలంతా కలిసి దేశ రాజధానిలోని కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) ప్రధానకార్యాలయాన్ని ముట్టడిస్తా >>2

# పేదలకు ‘పట్టా’భిషేకం

## 60వేల మందికిపైగా ఇప్పటిదాకా పట్టాలు పంపిణి
### డబుల్ ఇంజిన్ సర్కార్‌తో వందల రెట్లు లబ్ధి
### ‘ఉమెన్ వర్క్ ఫోర్స్’లో టాప్ విశాఖ, విజయవాడ
### విజయవాడలో పేదలకు పట్టాభిషేకం బహిరంగసభలో సిఎం చంద్రబాబు



బుధవారం విజయవాడలో జరిగిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో లబ్ధిదారులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజలు వేసిన ప్రతీ ఓటుకూ న్యాయం చేస్తూ ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడుతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తోందని వ్యాఖ్యానించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న భూములకు హక్కులు కల్పిస్తూ పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. బహిరంగ సభలో ఏర్పాటు చేసిన ర్యాంపుపై మంత్రులు సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ తో కలిసి నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ “ విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చాం. ఇప్పుడు విజయవాడలో 26,401 వేల మంది కుటుంబాలకు పట్టాలు ఇస్తున్నాం. మొత్తం కలిపి ఇప్పటి వరకూ 60 వేల మంది పేదలకు పట్టాలు ఇవ్వటం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ.52 వేల కోట్ల విలువైన భూముల్ని పేదలకు ఇవ్వటం సంతోషంగా ఉంది. పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం ఇది. విజయవాడలో ఇస్తున్న భూముల విలువ రూ.28,112 కోట్లుగా ఉంది. 707 ఎకరాల్లోని 34 లక్షల చదరపు గజాల స్థలానికి పేదలకు హక్కులు కల్పించాం. ఒక్కో స్థలం విలువ రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఉంటుంది. ఇదే పేదల ఆత్మగౌరవానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం. దశాబ్దాలుగా పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించి మీ స్థలాలకు హక్కుల కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పేదలకు పట్టాలు వచ్చేలా కృషి చేసిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు అభినందనలు తెలియచేస్తున్నా. గత పాలనలో ఐదేళ్ల పాటు విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం, ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను భవిష్యత్తు కోసం జాగ్రత్తగా కాపాడు కోవాలని అందరికీ సూచిస్తున్నాను. రాష్ట్రంలో >>2

### గ్లోబల్ సిటీస్ ఇండెక్స్‌లో ఎపి నగరాలు

పురాణ కాలంలో రాజులు యజ్ఞాలు చేస్తే రాక్షసులు అడ్డుపడేవారు. ఇప్పుడు గొడ్డలి పార్టీ అదే పనిచేస్తోంది. పేదలకు పట్టాలు ఇస్తుంటే ఎలా ఇస్తారంటూ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోంది. ఇలా ఏ పనిచేసినా ఆ పార్టీ నేతలు అడ్డుపడుతున్నారు. అమరావతి ప్రజా రాజధాని నిర్మాణాల్ని కూడా ఆ పార్టీ అడ్డుకుంటోంది. ప్రపంచ బ్యాంకులు లేఖలు రాశారు. చెరుకు తోటలు తగులబెట్టారు. ఇలా నానా విన్యాసాలు చేశారు. రాజధాని నిర్మాణానికి నిధులు రాకుండా అడ్డుకునేందుకు ప్రపంచబ్యాంకుకు లేఖలు రాశారు. మూడు రాజధానులని, అమరావతి శ్మశానమని వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత వచ్చిన రోజే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. మావిగన్ అంటే విజయవాడలో ఉన్నవారికైనా అర్థం అయ్యిందా అని ప్రశ్నిస్తున్నా. ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా >>2


బుధవారం విజయవాడలో ఉల్లి కౌంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

# రూ.35కే ఉల్లి

## 130 రైతుబజార్లలో లభ్యం
### త్వరలో మొబైల్ వాహనాల ద్వారా పంపిణి: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యావసరాల ధరలు పెరుగుతున్న తరుణంలో సామాన్యులకు ఊరట కలిగించడమే లక్ష్యంగా రైతుబజార్లలో రూ.35కే కిలో ఉల్లిపాయలు అందిస్తున్నామని ఏపీ పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలిదశలో 130 రైతు బజార్లలో ఈ పంపిణీ ప్రారంభించాం. త్వరలో మొబైల్ వాహనాల ద్వారా కూడా సరఫరా చేస్తాం. బియ్యాన్ని ఇప్పటికే తక్కువ ధరకు ఇస్తున్నాం. త్వరలో పామాయిల్, కంది పప్పు, పంచదార, గోధుమపిండిని కూడా సబ్సిడీపై అందుబాటులోకి తీసుకొస్తాం. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నుంచి సామాన్యులకు >>2

# స్థానిక ఎన్నికల సమన్వయానికి త్వరలో కమిటీలు

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ తరఫున పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా సమన్వయం, పర్యవేక్షణకు త్వరలో నూతన కమిటీలను నియమించాలని పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. గతంలో >>2

# ఉద్యోగాలే మా అజెండా

## డిఎస్సీపై ఆరోపణలు చేస్తున్నది రాజకీయ నిరుద్యోగులే
### ఆ స్పోర్ట్స్ సర్టిఫికెట్లు వైసిపి హాయాంలో ఇచ్చినవే
### వ్యవస్థలో మార్పు కోరుతున్న జెన్‌జి యువత
### కొచ్చి కాంక్లేవ్ సౌత్‌లో మంత్రి లోకేష్



**విజయవాడ,సెప్టెంబరు 30, ప్రభాతవార్తప్రతినిధి:** యువత మమ్మల్ని అడుగుతున్న ఒకే ఒక్క విషయం ఉద్యోగాల కల్పన. అందుకే మా ప్రభుత్వం ఉద్యోగాల కల్పనే ప్రధాన అజెండాగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి నుంచి చివరి స్థాయి ఉద్యోగి వరకు అందరూ ఉద్యోగాల సృష్టిపైనే పని చేస్తున్నారు. యువత కలల సాకారం కోసమే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం నిర్ణయించామని ఏపీ విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. నేను ఎప్పుడూ ఉన్నత పదవులను ఆశించలేదు. ప్రజల హృదయాలను గెలుచుకోవాలనే లక్ష్యంతోనే పనిచేశానన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి నా ప్రాధాన్యత కాదు అన్నారు. విద్యా వ్యవస్థను వీలైనంత త్వరగా మార్చడమే ఇప్పుడు నా ప్రాధాన్యత. అదే నన్ను ప్రతిరోజూ ముందుకు నడిపిస్తుంది అన్నారు. పరీక్షలు జరుగుతున్నప్పుడు మొత్తం బృందం అప్రమత్తంగా ఉంటుంది. ఎలాంటి తప్పులు జరగకుండా పర్యవేక్షిస్తాం. ఎందుకంటే అది పిల్లల భవిష్యత్తు. అందుకే నేను ప్రతిరోజూ దానిపైనే దృష్టి పెడతాను అన్నారు. కేరళంలోని కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2026లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు,రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన అనేక సూటి ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు. డీఎస్సీపై రాజకీయ నిరుద్యోగులే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు, వాస్తవానికి వారు ఆరోపిస్తున్న స్పోర్ట్స్ సర్టిఫికెట్లన్నీ గత వైసీపీ ప్రభుత్వంలో జారీ చేసినవేనన్నారు. క్వాంటమ్ అనేది ఊహ కాదు, నెక్స్ట్ జెనరేషన్ టెక్నాలజీ. ఆంధ్రప్రదేశ్ దాన్ని అందిపుచ్చుకుంది. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నాం. దానిపై పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పనిచేసి క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు. తాను క్రికెట్ చూడటానికి వెళ్లినపుడు కూడా పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెట్టుబడులు రాబట్టినట్లు మంత్రి లోకేష్ తెలి >>2

# కొండ ప్రాంతవాసుల కళ్లలో కొత్త వెలుగు

### ఇళ్లపట్టాల పంపిణితో పండగ వాతావరణం: మంత్రి నాదెండ్ల

**విజయవాడ. సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరంలో 26,401 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో లబ్ధిదారుల ముఖాల్లో ఇంతటి ఆనందాన్ని ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. కొండ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఎండనకా, వాననకా కష్టపడి ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న 12 వేల మందికి పైగా పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు అందించడం గర్వకారణమని మంత్రి తెలిపారు. ఇళ్ల పట్టాల ద్వారా పేదలకు తమ ఆస్తిపై శాశ్వత హక్కుతో పాటు భద్రత, భరోసా లభిస్తుందని చెప్పారు. పిల్లల చదువులు, వారి భవిష్యత్ అవసరాలు, వివాహాలు, బ్యాంకు రుణాలు వంటి కీలక సందర్భాల్లో ఈ పట్టాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి వివరించారు. పేదల ఆస్తికి చట్టబద్ధమైన హక్కును కల్పించడం ద్వారా వారి జీవితాల్లో భద్రతను పెంచే అవకాశం ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బాధితులుగా మిగిలిపోయిన ప్రజలను నేడు లబ్ధిదారులుగా మార్చిన ఘనత ఎన్డీయే కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పేదల కన్నీళ్లు తుడిచి, వారి జీవితాల్లో పండుగ వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత ఆస్తి హక్కు కల్పించినందుకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరఫున అధికారులందరికీ మంత్రి నాదెండ్ల మనోహర్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. పేదల సంక్షేమం,వారి ఆస్తి హక్కుల పరిరక్షణకు >>2

# గాంజా ఘాటు

## తెలుగు రాష్ట్రాల్లో ఫుల్!



### ఒడిశా, ఆంధ్ర ఏజెన్సీల నుంచి భారీగా అక్రమ రవాణా
### పుష్ప సినిమా ఫక్కీలో తరలింపు
### యేటా లక్ష కిలోల గంజాయి స్వాధీనం.. 5 వేల మంది అరెస్టు
### హైదరాబాద్‌లో రికార్డు స్థాయి అమ్మకాలు

ప్రభాతవార్త / న్యూస్‌నెట్‌వర్క్

విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో గంజాయికి అలవాటు పడుతున్నారు. ఇంజనీరింగ్, మెడికల్, ఎంబిఏ కళాశాలల క్యాంపస్‌లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆదిలాబాద్‌లోని ట్రిపుల్ ఐటిలో కూడా గంజాయిని విద్యార్థులు సేవిస్తూ పట్టుపడిన ఘటనలు వెలుగు చూశాయంటే పరిస్థితి ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. పంజాబ్‌లో డ్రగ్స్ విక్రయాలతో పోలిస్తే ఆ స్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో గంజాయి వినియోగం పెరుగుతోందని పోలీసు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గంజాయి అక్రమ రవాణా పోలీసులకు >>2

‘సర్’పై వివాదం వేళ..

# కొత్త ఓటర్లకు శుభవార్త

### ఫామ్6లో అదనపు డిక్లరేషన్ తొలగింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఓటర్ల నమోదు ప్రక్రియలో కీలక నిర్ణయం తీసుకుంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన రాష్ట్రాల్లో, కొత్త ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారి సౌలభ్యంకోసం ఫారమ్6లో పొందుపరచిన అదనపు డిక్లరేషన్‌ను ఎలక్షన్‌కమిషన్ వెనక్కి తీసుకుంది. ఈ మేరకు అధికారికంగా చర్యలు చేపట్టిన ఇసి, సంబంధిత రాష్ట్రాల్లోని ఇసినెట్ (ఇసిఎన్ఇటి) యాప్, పోర్టల్ అలాగే ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి (ఎస్ఇసి) వెబ్‌సైట్ల నుంచి ఈ అదనపు డిక్లరేషన్ ఆప్షన్‌ను పూర్తిగా తొలగించింది. తాజా మార్పుతో సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముగిసిన రాష్ట్రాల్లో కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే యువతకు, అర్హులైన పౌరులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఈ నిర్ణయంతో కొత్త ఓటర్లు గతంలో జరిగిన ఎస్ఐఆర్ సర్వేవివరాలు,తమ తల్లిదండ్రులు, తాతముత్తాతలకు సంబంధించిన పాత ఓటర్ల >>2

01-10Pg3exHMNWJQEGPBKR.qxdO/P:01-10Pg3exHMNWJQEGPBKR.qxd 1/1/02 8:07 AM Page 1



# నాలుగుజోన్లుగా తిరుపతి పోలీస్ కమిషనరేట్ !




**తిరుపతి,సెప్టెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి యాత్రాస్థలంగానేక పుణ్యక్షేత్రంగా కూడా అంతర్జాతీయంగా ఖ్యాతిచెందడంతో ఇక్కడ పోలీస్ వ్యవస్థ మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. గతంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఒకే ఎస్పీ క్రింద పరిపాలన జరిగిన తిరుపతి,శ్రీకాళహస్తి,తిరుమల వంటి పుణ్యక్షేత్రాలు ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో అధికారంలోకి రావడంతో సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తిరుపతి ప్రాధాన్యతతో అర్బన్ పోలీస్ జిల్లా కు సుముఖత చూపారు. చిత్తూరు జిల్లా ఎస్పీ నేతృత్వంలోని పోలీస్ పరిపాలనలో తిరుపతిలో అదనపు ఎస్పీ, ఒక డిఎస్పీ క్రిందే సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖ నడిచింది. ఆ తరువాత తిరుపతి విస్తరించడం, జనాభా పెరగడంతో శాంతిభద్రతల పరిరక్షణతోబాటు నేరాలనియంత్రణ, ప్రముఖుల భద్రతతో పోలీస్ అర్బన్ జిల్లా అవసరం ఏర్పడింది. దీంతో 2010 జూన్ 8న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ ఉత్తర్వు తిరుపతి పోలీస్ అర్బన్ జిల్లా ప్రతిపాదనలు విడుదల చేసింది, అయితే పూర్తిస్థాయిలో తిరుపతి అర్బన్ పోలీసు జిల్లాగా కార్యకలాపాలు 2016లో మొదలయ్యాయి. అప్పట్లో తొలి అర్బన్ ఎస్పీగా డాక్టర్ రవీందర్ నియమితులయ్యారు. ఆ తరువాత పలువురు ఐపిఎస్ అధికారులు ఆర్.జయలక్ష్మి, జొన్నలగడ్డ ప్రభాకర్‌రావు, అభిషేక్‌మహంతి, డాక్టర్ గజరావు భూపాల్, అన్బురాజన్, ఆవుల రమేశ్‌రెడ్డి, సిహెచ్. వెంకటఅప్పలనాయుడు ,పరమేశ్వర్‌రెడ్డి, మల్లికా గార్గ్,కృష్ణకాంత్ పటేల్, హర్షవర్ధన్‌రాజుఎస్పీలుగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడు కొనసాగుతున్నారు. తిరుమల, తిరుపతి తూర్పు, తిరుపతి పశ్చిమం, రేణిగుంట శ్రీకాళహస్తి సబ్‌డివిజన్లు అర్బన్ జిల్లా క్రిందకు చేరాయి. సుమారు ఎనిమిదేళ్ళ పాటు తాత్కాలిక భవనాల్లో కొనసాగిన పోలీస్ కార్యాలయం ఆ తర్వాత 2019లో సొంత భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది.2025లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. 2022లో గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తిరుపతిని పూర్తి స్థాయి రెవెన్యూ జిల్లాగా మార్చారు. దీనితో పూర్వపు తిరుపతి అర్బన్ పోలీస్ పరిధి మరింత విస్తరించి, ప్రస్తుతం తిరుపతి జిల్లా పోలీస్ శాఖగా రూపాంతరం చెందింది. ఎస్పీ హోదాలో నడుస్తున్న జిల్లా పోలీస్‌శాఖను ఇక రానున్న రోజుల్లో డిఐజి అధికారి హోదాలో పాలన సాగనుంది. తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లా స్థాయి నుండి పోలీస్ జిల్లాగా రూపాంతరం చెందిన తరువాత తాజాగా యాత్రాస్థలం తిరుపతి పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు దిశగా సిద్ధమైంది. తాజాగా పోలీస్ కమిషనరేట్ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చింది. ఇప్పటికే రాష్ట్ర పోలీస్ బాస్ (డిజిపి)హరీష్‌కుమార్‌గుప్త నుండి నివేదికలు, ప్రతిపాదనలతో కూడిన డాటా ప్రభుత్వానికి చేరింది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పూర్తిస్థాయిలో సమగ్ర వివరాలు, కొత్త సబ్‌డివిజన్లు, సర్కిళ్ళు, మరికొన్ని మండలాలు, నియోజకవర్గ కేంద్రాలు ప్రాంతాలు కమిషనరేట్ పరిధిలోకి చేరనున్నాయి. ప్రముఖ యాత్రాస్థలంగా కూడా ఖ్యాతిచెందిన తిరుపతి జిల్లా తిరుపతిని పోలీస్ కమిషనరేట్‌గా తీర్చిదిద్దనుంది. నాలుగుజోన్లుగా తిరుపతి,తిరుమల,శ్రీకాళహస్తి, శ్రీసిటీ కమిషనరేట్ పరిధికి రానున్నాయి. డిఐజి హోదాలో తొలి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది.డిప్యూటీ కమిషనర్స్ ఆఫ్ పోలీస్ హోదాలో ఐపిఎస్ అధికారులు రానున్నారు. వారికి సహాయకులుగా ఇద్దరు నాన్‌కేడర్ ఎస్పీలు డిసిపి పోస్టులు భర్తీచేయనున్నారు. తిరుపతి కమిషనరేట్ పరిధిలోనూ మరిన్ని కొత్త పోలీస్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది.తిరుపతి జిల్లాలో ప్రధానంగా తిరుమల శ్రీవారి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి కాళహస్తీశ్వరస్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, పెద్దపారిశ్రామిక వాడ సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ ఉండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుపతి తిరుమలకు ప్రతిరోజూ లక్షమంది వరకు యాత్రికులు వస్తుండటం,ముఖ్యంగా కేంద్ర,రాష్ట్ర మంత్రులు, న్యాయాధికారులు, ప్రముఖులు, విదేశాల నుండి ప్రముఖులు పర్యటిస్తుండటంతో వారికి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు అదనపు పోలీస్ బలగాలు అవసరం ఉంది. 2024లో రాష్ట్రంలో మళ్ళీ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో తిరుపతిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. సిఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాకూడా కావడంతో ఇక్కడ పరిపాలన పరంగా, పోలీస్‌శాఖను మరింత బలోపేతం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు. తిరుపతి నగరం జనాభా అనూహ్యంగా పెరిగింది. జనాభా 6లక్షల వరకు చేరగా ఓటర్లు 3లక్షలమంది ఉన్నారు. ఇదేగాక తిరుపతి నగరపాలకసంస్థ గ్రేటర్‌గా రూపుదిద్దుకోనున్న తరుణంలో పరిసరాల్లోని గ్రామాలు, కాలనీలు, పంచాయతీలు తిరుపతి గ్రేటర్ కార్పొరేషన్ క్రిందకు చేరనున్నాయి. దీంతో జనాభా కూడా మరింతగా అధికం కానుంది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాతోబాటు తిరుపతి మహానగరంలో శాంతిభద్రతల పరిరక్షణ ,పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని తిరుపతిని పోలీస్ కమిషనరేట్‌గా ప్రకటించారు.

**అదనంగా మరికొన్ని నూతన సబ్ డివిజన్లు**

## రాష్ట్రంలో ఏడుగురు ఐఎఫ్ఎస్ అధికారుల బదలీలు

**అమరావతి,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఏడుగురు ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీలు అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంపచోడవరం డీఎఫ్ఓగా శివకుమార్, చింతూరు డీఎఫ్ఓగా సంకేత్ సునీల్, ఆత్మకూరు ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌గా కె.వెంకట శ్రీకాంత్ కడప డీఎఫ్ఓగా కె.బాలరాజు, పార్వతీపురం డీఎఫ్ఓగా నీరజ్ హాన్స్, విజయనగరం డీఎఫ్ఓగా బబిత కుమారి, అనంతపురం డీఎఫ్ఓగా.రవీంద్రనాథ్‌లు బదిలీ అయ్యారు.

వీరంతా తాము బదిలీ అయిన ప్రాంతాల్లో తక్షణం రిపోర్ట్ చేసి.విధుల్లో చేరాలని సూచించారు.

## దసరా ఉత్సవాలకు సిఎం చంద్రబాబుకు ఆహ్వానం



దసరా ఉత్సవాలకు సిఎం చంద్రబాబుకు ఆహ్వానిస్తున్న దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ

అమరావతి,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు ఆహ్వానించారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు రావాలని సీఎం చంద్రబాబును క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా అర్చకులు ముఖ్యమంత్రికి అమ్మవారి ప్రసాదాన్ని అందించి వేదాశీర్వచనం ఇచ్చారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీసిన సీఎం... భక్తులకు సౌకర్యాల కల్పనలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సీఎంను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించిన వారిలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈఓ శీనా నాయక్, బోర్డు సభ్యులు ఉన్నారు.

## అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివి, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

**నరసాపురం, సెప్టెంబరు 30 (ప్రభాతవార్త):** గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. వారి వేతనాల పెంపు అంశాన్ని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా నరసాపురంలోని తెలగ కళ్యాణ మండపంలో నిర్వహించిన 'అంగన్‌వాడీ ఉత్సవంలో మంత్రి, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఎంపీ పాక సత్యనారాయణ పాల్గొని అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆయాలను సన్మానించారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు సేవలందిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీ పాక సత్యనారాయణ తెలిపారు. సదుపాయాలు లేని కేంద్రాలను గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

## మాజీ సిఎం జగన్ కీలక నిర్ణయం

- కార్యకర్తలు మరణిస్తే వారి కుటుంబాలకు ఆర్థిక సాయం



**విజయవాడ, సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ముఖ్య మంత్రి,వైసిపి అధినేత జగన్ కీలక నిర్ణయం ప్రకటించారు. పార్టీలో భాగస్వాములైన కార్యకర్తలు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు. అందు లో భాగంగా ఆర్థికంగా అందించే సాయం పైన స్పష్టత ఇచ్చారు. కష్ట కాలంలో కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పార్టీ కోసం పనిచేస్తూ మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం అధికారికంగా వివరాలు వెల్లడించింది.

## పట్టణాల్లో మంచినీటి సమస్య పరిష్కారంలో నిరక్ష్యం వద్దు

- కెపాసిటీ బిల్డింగ్‌పై ప్రభుత్వ ఉద్యోగులకు ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ - ఆర్టీజిఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి



ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖలు అందించే సేవలపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ, అన్నక్యాంటీన్లు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, సంక్షేమ హాస్టళ్లల్లో వసతులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు కెపాసిటీ బిల్డింగ్, నైపుణ్య శిక్షణలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉందని సీఎం చెప్పారు. ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించామని అన్నారు. రియల్ టైమ్‌లో పని చేసేలా ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారన్నారు. వివిధ వర్చువల్ కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఐఏఎస్ అధికారులు ఎప్పటికప్పుడు ఓరియేంటేషన్ తీసుకుంటూ స్కిల్స్ అప్‌గ్రేడ్ చేసుకుంటారో... అదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణ కోసం ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ ఇప్పించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక తాగునీటి సమస్యను నివారించే విషయంలో ఎంత మాత్రం నిరక్ష్యం వహించొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా పట్టణాల్లో తాగునీటి సరఫరా ఎలా ఉందని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో వర్షాలు పడడంతో పట్టణాల్లో తాగునీటి సమస్య చాలా వరకు తగ్గిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. రాయలసీమలో రెండు మున్సిపాల్టీల్లో కొద్దిపాటి తాగునీటి సమస్య ఉందని.. దాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక విశాఖ నగరంలో కూడా గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ అయిందని.. తాగునీటి సమస్యను అధిగమిస్తున్నామని అధికారులు వివరించారు. పట్టణాల్లో కానీ.. పల్లెల్లో కానీ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాలు పడ్డాయని నిరక్ష్యంతో ఉండొద్దని సూచించారు. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వాములను చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు.

## ఆంధ్రప్రదేశ్ వేస్ అండ్ మీన్స్ పరిమితిని రూ.3,197 కోట్లకు పెంచిన కేంద్రం

**విజయవాడ,సెప్టెంబరు30,ప్రభాతవార్తప్రతి నిధి:**ఆంధ్రప్రదేశ్ వేస్ అండ్ మీన్స్ పరిమితిని రూ.2,921 కోట్ల నుంచి రూ.3,197 కోట్లకు కేంద్రం పెంచింది, స్వల్పకాలిక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు చేబదుళ్ల (వేస్ అండ్ మీన్స్) అందిస్తారు. తాజాగా ఈ పరిమితిని 11.2 శాతం మేర పెంచాలని ఆర్‌బీఐ సలహా కమిటీ విడుదల చేసిన నివేదికలో సిఫార్సు చేసింది. దీని వల్ల ఈ పద్దు కింద రాష్ట్రాలకు నెలవారీగా అందే చేబదుళ్ల సాయం రూ.61,008 కోట్ల నుంచి రూ.67,839 కోట్లకు పెరుగుతుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిమితి రూ.2,921 కోట్ల నుంచి రూ.3,197 కోట్లకు అనగా 9.4 శాతం మేర పెరగనుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం, వ్యయాల మధ్య బాగా అంతరం ఏర్పడితే అత్యవసర వినియోగానికి కూడా ఖజానాలో నిధులు లేక ఒక్కో రోజు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో రిజర్వు బ్యాంకు నుంచి తాత్కాలికంగా చేబదుళ్లు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ రుణాలను తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం రాగానే ఆర్‌బీఐకి కట్టేయాలి. ఓవర్ డ్రాఫ్ట్ పేరుతో వరుసగా 14 రోజుల పాటు నిధులు పొందవచ్చు. ఒక త్రైమాసికంలో గరిష్ఠంగా 36 రోజుల పాటు ఓవర్‌డ్రాఫ్ట్‌లో నిధులు తీసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరంలో మొదటిసారి వరుసగా ఐదు పనిదినాలపాటు గరిష్ఠ పరిమితి (100 )కి మించితే, రుణసేకరణను తగ్గించుకోవాలని రాష్ట్రానికి ఆర్‌బీఐ సలహా ఇస్తుంది. అదే ఆర్థిక సంవత్సరంలో రెండు లేదా అంతకన్నా ఎక్కువసార్లు గరిష్ఠ పరిమితికి మించి తీసుకుంటే చెల్లింపులను నిలిపివేస్తుంది. 2022- 23 నుంచి 202425 వరకు రాష్ట్రాలు సాధించిన ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని కమిటీ ఈ మేరకు సిఫార్సు చేసింది. రాష్ట్రాలు దీనివల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకొని స్వల్పకాల ఆర్థిక అవసరాలను తీర్చుకోవాలని సూచించింది. ఇటీవల కాలంలో రాష్ట్రాలు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని ఉపయోగించుకొనే రోజులు తగ్గిపోయినందున ఇకనుంచి ఓడీని వరుసగా ఉపయోగించుకొనే రోజులను 14 నుంచి 10కి తగ్గించాలని సిఫార్సు చేసింది. అలాగే ఒక త్రైమాసికంలో ఉపయోగించుకొనే గరిష్ఠ రోజులను కూడా 36 నుంచి 30కి తగ్గించాలని సూచించింది. కన్సాలిడేటెడ్ సింకింగ్ ఫండ్ , గ్యారంటీ రిడంప్షన్ ఫండ్ లలో రాష్ట్రాలు కనీసం 5 శాతం నిధి ఉంచాలన్న నిబంధన ఉన్నప్పటికీ కొన్ని రాష్ట్రాలు ఇప్పటికీ ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదని కమిటీ గుర్తుచేసింది.ఈ రెండు నిధుల్లో రాష్ట్రాలు నిర్దేశించిన నిల్వలు ఉంచేందుకు వీలుగా ప్రోత్సాహకాలు అందించాలని సూచించింది. 2026 జులై నాటికి ఏపీ నుంచి సీఎస్ఎఫ్‌లో రూ.8,307 కోట్లు ఉన్నాయి. మార్కెట్ నుంచి తీసుకొనే రుణాల్లో ఇది 1.6 శాతం మాత్రమే. జీఆర్ఎఫ్‌లో రూ.8,958 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన మొత్తం గ్యారంటీల్లో ఇది 5.8 శాతానికి సమానం. జీఆర్ఎఫ్‌లో ఆర్‌బీఐ సిఫార్సు చేసినంత మేర నిల్వలు ఉన్నప్పటికీ, సీఆర్ఎఫ్‌లో మాత్రం తక్కువ ఉన్నాయి.

## సిఇసి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలి

- తిరుపతిలో కాంగ్రెస్ నేతల డిమాండ్



**తిరుపతి,సెప్టెంబర్ 30ప్రభాత వార్తప్రతినిధి:** రాజ్యాంగ విలు వలను, ప్రజాస్వామ్యాన్ని పరి రక్షించాల్సిన భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అందుకు విరుద్ధంగా వ్యవహరించారని ఆయన తక్ష ణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఎఐసిసి, పిసిసి పిలుపు మేరకు బుధవారం తిరుపతిలో వివేకానంద విగ్రహం వద్ద నుండి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పిఎం మోదీ,సిఇసి జ్ఞానేష్ కుమార్ ల దిష్టిబొమ్మలను ఊరేగింపు గా కార్పొరేషన్ కార్యాలయం వద్దకు తీసుకువెళ్లారు. వాటిని దగ్ధం చేయడానికి సిద్ధమవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పార్టీ జెండాలను చేతపట్టుకుని సిఇసి కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగ కల్పించిన హక్కని చెప్పారు. కేంద్రంలో అధికారంలో బిజెపి కొనసాగడానికి సిఇసి సంపూర్ణంగా సహకరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే దేశంలో ని ఓటరు జాబితా సవరణలో అక్రమాలకు తెరలేపారని ఆరోపించారు. ఒక్కో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఓటర్లను అనర్హులుగా ప్రకటించడమే ఇందుకు నిదర్శనమన్నారు. స్వతంత్ర రాజ్యాంగ సంస్థ బిజెపి జేబు సంస్థగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే జ్ఞానేశ్ కుమార్ తక్షణం తన పదవికి రాజీనామా చేయాలన్నారు. సర్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు ఇతర ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసులు కూడా ఇచ్చాయన్నారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా బలహీన వర్గాలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లను కావాలనే తొలగించారని విమర్శించారు.

# తిరుమల సమాచారం

## అక్టోబర్‌లో మళ్లీ రెండు గరుడసేవలు

-16న బ్రహ్మోత్సవానికి -26న పౌర్ణమి సేవ



**తిరుమల,సెప్టెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులకు అక్టోబర్‌నెలలో మళ్ళీ రెండుసార్లు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి గరుడవాహన సేవ వీక్షించే భాగ్యం కలగనుంది. ఆగస్టు, సెప్టెంబర్‌నెలల్లో గరుడపంచమిరోజు, పౌర్ణమిరోజు ,సాలకట్ల బ్రహ్మోత్సవాన, పౌర్ణమివేళ రెండుసార్లు గరుడవాహనంపై మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చిన విషయం విదితమే. ఇప్పుడు అక్టోబర్‌నెలలో కూడా తిరుమలలో మలయప్పస్వామి గరుడవాహనంపై రెండుసార్లు అభయమివ్వనున్నారు. అక్టోబర్ 16న శుక్రవారం రాత్రి నవరాత్రి బ్రహ్మోత్సవాల వేళ, తిరిగి 26వతేదీ సోమవారం పౌర్ణమిఘడియల్లో గరుడవాహనం ఊరేగింపు జరగనుంది. 108 వైష్ణవ దివ్య దేశాలలో గరుడ వాహన సేవకు ఎంతో పవిత్రమైన స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు పరమ భక్తుడు, వాహనమైన గరుడుడు వేద స్వరూపానికి, ఆధ్యాత్మిక జ్ఞానానికి వైరాగ్యానికి ప్రతీక. తనను సంపూర్ణ విశ్వాసంతో శరణు కోరిన భక్తులకు భగవంతుడు అందించే అపారమైన అనుగ్రహానికి ఈ సేవ నిదర్శనమని పండితులు చెబుతుంటారు.

## పెరటాసి మాసంలో కొండ కిటకిట

- వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల,సెప్టెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పెరటాసి మాసం కావడంతో తిరుమలకొండ భక్తజనసంద్రంగా మారింది. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఇంకా పదిరోజులు ఉండగానే ముందుగానే ఏడుకొండలు భక్తులతో కిటకిటలాడుతోంది. గత మూడురోజులుగా తిరుమలలో క్యూలైన్లు ఆలయం వెలుపల నాలుగుకిలోమీటర్లు వరకు వ్యాపించాయి. బుధవారం ఉదయానికి బాటగంగమ్మ ఆలయం వద్దనుండి భక్తులను అనుమతినిస్తున్నారు. సాధారణరోజుల్లోనే ఈ రద్దీ ఇలా విపరీతంగా ఉంటే రానున్న శనివారం వారాంతం, మూడవపెరటాసి శనివారం,ఆదివారం రోజుల్లో 2లక్షలమంది వరకు భక్తులు పెద్దసంఖ్యలో తిరుమలకు చేరుకునే అవకాశం ఉందని టిటిడి వర్గాలు అంచనా వేస్తున్నాయి. బుధవారం ఉదయానికి వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సాధారణ సర్వదర్శనం (టోకెన్ లేని భక్తులు)భక్తులు వేలాది మంది దేశం నలుమూలల నుండి తరలివస్తున్నారు. ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో బాటగంగమ్మఆలయం వరకు బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 24గంటలు సమయం పడుతుండగా సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగి 26గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఎనిమిదిగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. విపరీతమైన రద్దీతో గురువారం విఐపి బ్రేక్ దర్శనాలను రద్దుచేశారు. బుధవారం సాయంత్రం వరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 30వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. తిరుమలకు చేరుకునే సామాన్యభక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో భక్తులు సంయమనంతో వ్యవహరించాలని, దర్శనం సమయం వరకు వేచి ఉండాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## తిరుమల పోటుకు స్టౌవ్‌లు విరాళం



**తిరుమల,సెప్టెంబర్ 30ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమలలోని పోటుకు అవసరమైన అత్యాధునిక స్టౌలను దాత విరాళంగా అందించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన పుష్కర్ ప్రాపర్టీస్ సంస్థ ఎండి కృతి వాసన్ తిరుమల శ్రీవారి ఆలయ పోటులో వడల తయారీకి అవసరమైన నాలుగు పెద్ద స్టౌవ్ లను బుధవారం సాయంత్రం విరాళంగా ఇచ్చారు. దాత తరఫున ఆ సంస్థ ప్రతినిధి మురళీ తిరుమలలోని పిండిమర వద్ద శ్రీవారి ఆలయ పోటు ఏఇఒమునిరత్నం కు స్టౌవ్ లను అందజేశారు.

## స్థానిక ఎన్నికల్లో గెలిచే సమర్థులైన అభ్యర్థులకే టికెట్లు

- త్వరలో రెండోవిడత నామినేటెడ్ పదవులు

- గంగమ్మ ఆలయంలో టిడిపి చీఫ్ పల్లాశ్రీనివాసరావు



**తిరుపతి,సెప్టెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీకి స్థానిక పోరు కంటే సార్వత్రిక ఎన్నికల లక్ష్యాలే ముఖ్యమని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జరగబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపు అవకాశాలు పుష్కలంగా ఉన్న సమర్థులైన అభ్యర్థులకే టికెట్లు కేటాయిస్తామని, ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఖరాఖండిగా తేల్చిచెప్పారు. త్వరలో రెండో విడత నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని ఆయన ప్రకటించారు.బుధవారం ఉదయం తిరుపతి పర్యటనలో భాగంగా శ్రీనివాసరావు తిరుపతి నగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు టిడిపి నేతలు,ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, ఇఒ ఎజయకుమార్ స్వాగతం పలికారు. ఆలయంలో గంగమ్మతల్లికి కుంకుమార్చన చేయించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వెలుపల పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో సీట్ల కేటాయింపు. నామినేటెడ్ పదవుల పై కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉంటుందని చెప్పారు. కూటమి నేతల సమన్వయ సమావేశాలు క్షేత్రస్థాయి నుండి వచ్చే సిఫార్సులను ముందుగా ఎన్డీయే కోఆర్డినేషన్ కమిటీ సమగ్రంగా పరిశీలిస్తుందని, అనంతరం సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర నాయకత్వం సంయుక్తంగా తుది నిర్ణయం తీసుకుంటాయని తెలిపారు. మేయర్ పదవుల విషయంలో బిజెపి, జనసేన పార్టీలకు వారి డిమాండ్లు ఉన్నాయని, అభ్యర్థుల ప్రజాదరణను అంచనా వేసేందుకు ఇప్పటికే ప్రత్యేక సర్వేలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కూటమి భాగస్వాములైన టిడిపి, జనసేన, బిజెపిల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసిపి తీవ్రంగా యత్నిస్తోందని ఆరోపించారు. టిడిపి, జనసేన పేర్లతో ఫేక్ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించి విభేదాలు రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని పల్లా మండిపడ్డారు. అలాగే స్వప్రయోజనాల కోసం ఇతర పార్టీల నుండి వచ్చే నేతలకు నేరుగా సీట్లు ఇచ్చే ప్రసక్తే లేదని పల్లా తేల్చి చెప్పారు.

## ముగ్గురు కార్మికుల మృతి

- టౌన్ ప్లానింగ్ అధికారులపై సస్పెన్షన్ వేటు

**తిరుపతికార్పొరేషన్,సెప్టెంబర్ 30ప్రభాతవార్త:** తిరుపతినగరంలోని డిబిఆర్ హాస్పిటల్ మార్గంలో శ్రీ కన్వెషన్ హాల్ సమీపంలో క్రేన్ బోల్తా పడి ముగ్గురు మృతి ఘటనపై జరిపిన ప్రాథమిక విచారణలో బాధ్యులుగా గుర్తించిన ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులపై నగరపాలకసంస్థ తక్షణమే సస్పెన్షన్ వేటువేసింది. ఈ ఘటనపై సమగ్రమైన , పారదర్శకమైన విచారణకు ఉన్నతస్థాయి అధికారులను విచారణాధికారులుగా నియమించేందుకు చర్యలు తీసుకున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. డిబిఆర్ హాస్పిటల్ రోడ్డులోని శ్రీ కన్వెషన్ హాల్ సమీపంలో నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో అదుపుతప్పి క్రేన్ బోల్తా పడడంతో ముగ్గురు కార్మికులు మరణించారని తెలిపారు. ఈ ప్రాంతాన్ని అధికారులతో కలసి పరిశీలించామని తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం భవన నిర్మాణ పర్యవేక్షణలో లోపం కనపరిచిన ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులను సస్పెండ్ చేశామని తెలిపారు. అన్ని కోణాల్లో పారదర్శకమైన పూర్తి విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఇందులో ప్రమేయం ఉన్న అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సర్వేపల్లి రాధాకృష్ణ మునిసిపల్ స్కూల్ భవనం పటిష్టత పై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. నగరంలో అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించని నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

## తిరుపతి నుంచి వారణాసి వరకు
# సేవా సంకల్ప యాత్ర

- టిడిపి జాతీయ వర్కింగ్ అధ్యక్షులు నారా లోకేష్ సూచనలతో ఆధ్యాత్మిక యాత్ర
- వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ నేతృత్వంలో బైక్ ల పై ప్రయాణం



**విశాఖపట్నం, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :**ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పురస్కరించుకొని టి ఎన్ ఎస్ ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో సేవా సంకల్ప యాత్ర చేప ట్టారు. టీడీపీ జాతీయ వర్కింగ్ అధ్యక్షులు, మం త్రి నారా లోకేష్ సూచనలతో తిరుపతి నుంచి వారణాసి వరకు 25 మంది యువత బైక్ యా త్రకు శ్రీకారం చుట్టారు. సుమారు 2500 కిమీ మేర సాగే ఈ బైక్ యాత్ర కు వి ఎం ఆర్ డి ఎ చైర్మన్, టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం వి ప్రణవ్ గోపాల్ నేతృత్వం వహిస్తున్నారు. బుధవారం తిరుపతి అలిపిరి గరుడ సర్కిల్ వద్ద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు , తిరుపతి టీడీపీ ఇంచార్జి జే బి శ్రీనివాస్ , సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ , సత్యవేడు అసెంబ్లీ సమన్వయ కర్త పి శంకర రెడ్డి , తిరుపతి పార్లమెంట్ ఇంచార్జి శ్రీమతి పన బాక లక్ష్మి యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసిం హ యాదవ్ , ఇతర కూటమి నాయకులు పాల్గొని బైక్ యాత్రను ప్రారంభించారు. ఈ నెల 30 న ప్రారంభమైన ఈ సేవా సంకల్ప యాత్ర అక్టోబర్ 8 న బైక్ యాత్ర వారణాసి చేరుకుంటుందని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల మీదుగా ఈ బైక్ యాత్ర సాగుతుందని తెలిపారు. ఈ యాత్రలో భాగంగా పలు ప్రముఖ ఆలయాలను దర్శించనున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 ఏళ్ల ప్రస్థానం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, సుపరిపాలన, ఆర్థిక ప్రగతి, మౌలిక వసతుల విస్తరణలో ఆయన చేస్తున్న కృషి కొనసాగాలని ఆకాంక్షి ంచారు. బైక్ యాత్ర లో భాగంగా తిరుపతి నుంచి కాళహస్తి చేరుకోగా, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాళహస్తి ఆలయం లో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కాళహస్తి నుంచి కావలి వరకు బైక్ యాత్ర చేరుకుంది. గురువారం సాయంత్రం నాటికి ఈ బైక్ యాత్ర విజయవాడకి చేరుకుంటుందని తెలిపారు.

## దసరా ఉత్సవాలకు సిఎం చంద్రబాబుకు ఆహ్వానం



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 30, ప్రభాతవార్త :**దుర్గమ్మవారి ఆలయంలో 2026 సంవత్స రంలో అక్టోబర్ 11 నుండి జరగబోయే దసరా ఉత్స వాల ఆహ్వాన పత్రికను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. కు దేవస్థానం తరపున రాష్ట్ర దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్రమోహన్, ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు దసరా ఉత్స వాల్లో దుర్గమ్మవారిని దర్శిం చుకుని పట్టువస్త్రాలను సమర్పించాలని బుధవారం వారు సిఎం ను ఆయన కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు ఆహ్వా నం పలకి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం అందించా రు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**- గవర్నర్‌కు ఆహ్వానం:**
దుర్గమ్మవారి ఆలయంలో జరగబోయే దసరా ఉత్స వాల్లో పాల్గొనాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు రాష్ట్ర దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్రమోహన్, ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు బుధవారం ఆహ్వానించారు.

**- దుర్గమ్మవారి సేవలో విఐపిలు :**
దుర్గమ్మవారిని కేంద్ర కెపాసిటి బిల్డింగ్ కమీషన్ చైర్‌పర్సన్ ఎస్ రాధాచౌహాన్, రాష్ట్ర ఎలక్షన్ కమీషనర్ అనిల్ చంద్ర పునీత దంపతులు, సినీహీరో నాని బుధవారం దర్శించుకున్నారు.

**- నిత్యాన్నదాన పథకానికి విరాళం:**
దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి శ్రవణ్, సాన్వి స్వర్ణ ల పేరిట ఏలూరుకు చెందిన కాపర్ల శ్రీరామ్ రు.3,04,000ల విరాళాన్ని బుధవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, చిత్రపటంను దేవస్థానం అధికారులు అందజేశారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## కోర్టు తాళాలు పగలగొట్టిన దొంగలు : నగదు చోరీ

**గుంటూరు లీగల్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** గుంటూరు మెడికల్ కాలేజి రోడ్డులో మంగళవారం రాత్రి దొంగలు హల్చల్ చేశారు. కాలేజీ ఎదురుగల గుడితో పాటు పక్కనే ఉన్న కోర్టు తాళాలు కూడా పగలగొట్టారు. తొలుత ఈ రోడ్డు మొదట్లోగల, జిల్లా కోర్టు ఆవరణలోని పోక్సో కోర్టు తాళాలు పగలగొట్టారు. కోర్టు హాలు, న్యాయమూర్తి ఛాంబర్, ఆఫీసు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రూమ్ తో సహా అణువణువు గాలించారు. స్వీపర్, నిత్య అవసరాలు, ప్రింటింగ్ వంటి చిన్న ఖర్చుల కోసం బీరువాలో దాచి ఉంచిన 14వేల రూపాయలను కాజేశారు. దుండగులు తమ వెంట తీసుకువచ్చిన ఒక రాడ్డును కోర్టు హాల్లోనే వదిలి వెళ్లిపోవడం కొసమెరుపు. అనంతరం పక్కనే ఉన్న అంకమ్మ గుడి తాళాలు పగలగొట్టి హుండీని రైలు పట్టాల మీదకు తీసుకువెళ్లారు. నగదు మొత్తం తీసుకొని హుండీని పట్టాలపై వదిలి వెళ్లారు. ముందుగా ఉదయం గుడి సిబ్బంది గమనించి నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డాగ్ స్క్వాడ్ గుడి దగ్గర నుండి కోర్టు వైపుకు రావడంతో పోలీసులు అవాక్కయ్యారు. అప్పుడే వచ్చిన సిబ్బంది కోర్టు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ సిబ్బంది ఆధారాలు సేకరించారు. కోర్టు ఏ.వో ఫిర్యాదు చేయగా, నగరంపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యను హతమార్చిన భర్తకు యావజ్జీవం

**గుంటూరు లీగల్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** నిద్రిస్తున్న భార్య తలపై రోకలిబండతో కొట్టి చంపిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి బుధవారం తీర్పు చెప్పారు ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కృష్ణాజిల్లా, నూజివీడు, ఇందిరా కాలనీకి చెందిన బారోతు తావకు, ఆర్ఆర్ పేటకు చెందిన భూక్య రూపతో సంఘటనకు 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు. రూప మోటూరు గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తుండేది. నిందితుడు తావ కూలి పనులకు వెళుతూ ఉండేవాడు. పెళ్లయిన తొలినాళ్ల నుంచి అతడు భార్యపై అనుమానంతో మానసికంగా, శారీరకంగా వేధిస్తుండేవాడు. పలుమార్లు పెద్ద మనుషులు పంచాయతీ పెట్టి తావను మందలించారు. ఒక సందర్భంలో సందర్భంలో తీవ్రంగా కొట్టి హింసించటంతో రూప గుడివాడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. రాజీ చేసుకుని కొన్నాళ్లు సక్రమంగా ఉండి తిరిగి వేధింపులు ప్రారంభించడంతో రూప సంఘటనకు 20 రోజులు ముందు పిల్లలను తీసుకొని పుట్టింటికి చేరింది. 2024 ఏప్రిల్ 18న రూప పిన్ని దీరావతు లక్ష్మి ్మ తన కుమార్తెకు ఓణీల ఫంక్షన్ ఏర్పాటు చేసుకొని వేడుకకు పిలవగా 17వ తేదీనే రూప మోతడక వచ్చింది. ఆరోజు రాత్రి అందరూ నిద్రిస్తుండగా 18న తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో నిందితుడు తావ అక్కడికి వచ్చి పక్కనే ఉన్న రోకలి బండ తీసుకుని చాపపై నిద్రిస్తున్న భార్య రూప తలపై మోదాడు. తల పగిలి రూప కేకలు వేయగా, పిన్ని లక్ష్మి ్మతో పాటు ఇతర బంధువులందరూ లేవడంతో నిందితుడు రోకలిబండ అక్కడే పడేసి పరారయ్యాడు. రూప రక్తస్రావంతో స్పృహతప్పి పడిపోగా బంధువులు అంబులెన్స్ లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూప తండ్రి రాము తాడికొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా, తొలుత హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. మర్నాడు నిందితుడు తావాను అరెస్టు చేసి రిమాండ్ కు పంపారు. చికిత్స పొందుతూ రూప 21వ తేదీన మృతి చెందటంతో కేసును హత్యా నేరం కింద మార్చారు. సీఐ వేణు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడు తావకు యావజ్జీవ కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి తీర్పు చెప్పారు. జిల్లా కోర్టు ప్రధాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ చుక్కపల్లి రమేష్ ఈ కేసులో ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

# జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

- కాంగ్రెస్‌ను వీడిన పాతనేతలంతా తిరిగి చేరితే సంతోషిస్తా
- సిఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- కేరళలోని కొచ్చిలో కాన్‌క్లేవ్ సౌత్‌లో తెలంగాణ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్,సెప్టెంబరు30,ప్రభాతవార్త:**గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి.. ఆ తర్వాత వివిధ కారణాలతో పార్టీని వీడి ఇతర పార్టీలను ఏర్పాటు చేసిన వారు, ఇతర పార్టీల్లో చేరిన మాజీ కాంగ్రెస్ నేతలకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్‌ను వీడిన నేతలు తిరిగి పార్టీలోకి రావాలని.. హస్తం పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లేందుకు వారంతా కలిసి పనిచేయాలని కీలక సూచనలు చేశారు. కేరళలోని కొచ్చిలో జరుగుతున్న ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో బుధవారం పాల్గొన్న భట్టి విక్రమార్క.. ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌ను వీడి వెళ్లిన పాత నేతలంతా తిరిగి పార్టీలో చేరితే తాను చాలా సంతోషిస్తానని భట్టి విక్రమార్క చెప్పారు. పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను వీడి టన నేతలు తిరిగి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరాొడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. తాను వైఎస్సార్‌తో కలిసి పనిచేశానని.. అయితే ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పనిచేయలేదని స్పష్టం చేశారు. వైఎస్సార్ మరణం తర్వాత వైఎస్ జగన్ కాంగ్రెస్‌ను వీడి 2011లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన విషయాన్ని గుర్చు చేసిన భట్టి విక్రమార్క.. కాంగ్రెస్‌ను విడిచిపెట్టి పోయిన నేతలు తిరిగి వస్తే పార్టీని మరింత బలోపేతం చేయడానికి కలిసి పనిచేయవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లి సొంత రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన పలువురు ప్రముఖ నేతలు ఉన్నారు. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 1998లో కాంగ్రెస్‌ను వీడి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. అలాగే 1999లో శరద్ పవార్, పీఏ సంగ్మా, తారిఖ్ అన్వర్ కాంగ్రెస్ నుంచి విడిపోయి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. ఇక ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీని వీడి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌ను వీడిన నేతలకు భట్టి విక్రమార్క చేసిన పిలుపు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పైనా భట్టి విక్రమార్క మాట్లాడారు. ఎస్ఐఆర్ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని.. దీని వల్ల ప్రజల్లో అనుమానాలు ఏర్పడుతున్నాయని భట్టి ఆరోపించారు. కాంగ్రెస్ సహా దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిపక్షాలు అన్నీ ఈ ఆరోపణలు చేస్తుండగా.. ఎన్నికల సంఘం మాత్రం తన చర్యలు చట్టపరమైన ప్రక్రియలో భాగమేనని చెబుతోంది. ఓటింగ్‌పై అనుమానాలు ఉంటే బ్యాలెట్ పేపర్ల వినియోగం ద్వారా ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయంటూ వచ్చిన వార్తలు కూడా ప్రజల్లో అనుమానాలకు కారణం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిప్యూటీ సీఎం భట్టి డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 5 గ్యారంటీ పథకాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపయోగపడతాయని,రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ఆయన ప్రస్తావించారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని చెబుతూ.. రైతులకు ఆర్థిక సహాయం అందితే వారు సాగులో పెట్టుబడులు పెట్టి ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంటుందని వివరించారు.

తెలంగాణకు కేంద్ర పన్నుల వాటా విషయంలోనూ భట్టి విక్రమార్క తన అభిప్రాయాన్ని వెల్లడించారు. రాష్ట్రం కేంద్రానికి చెల్లించే పన్నులతో పోలిస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి తిరిగి వచ్చే వాటా తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇదే అంశంపై తెలంగాణతోపాటు మిగిలిన దక్షి ణాది రాష్ట్రాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. దేశం సమాఖ్య వ్యవస్థలో భాగమని.. రాష్ట్రాలు అందించే ఆదాయానికి అనుగుణంగా న్యాయమైన వాటా దక్కేలా కేంద్రం వ్యవహరించాలని భట్టి కోరారు. ఈ విషయంలో కేంద్రం సమాఖ్య స్ఫూర్తిని పాటించాలని ఆయన అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తన సంబంధాలపై కూడా భట్టి విక్రమార్క స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సమష్టిగా పనిచేస్తోందని చెప్పారు. నేతలంతా కలిసి చర్చించి, నిర్ణయాలు తీసుకుని కాంగ్రెస్ సిద్ధాంతాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. తనను కులం ఆధారంగా చూడకూడదని.. కాంగ్రెస్‌లో పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్త.. పార్టీకి చెందినవారేనని భట్టి వ్యాఖ్యానించారు. తన రాజకీయ భవిష్యత్తు, నాయకత్వ ఆకాంక్షలను కుల సమీకరణాలతో చూడడం సరికాదన్న భావనను ఆయన వ్యక్తం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షి ణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు.

## చెరువులో పడి బాలుడు మృతి

**నగరం,సెప్టెంబర్ 30,(ప్రభాతవార్త):**అప్పటివరకు ఇంటి ముంగిట నవ్వులు పూయించిన ఆ బాలుడు ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయాడు. స్కూల్ నుంచి వచ్చి అమ్మా నేను బయటకు వెళ్లి వస్తా అని చెప్పి వెళ్లిన కుమారుడు తిరిగి వస్తాడని ఎదురు చూసిన తల్లిదండ్రుల కళ్ల ముందు చివరికి నిశ్చల దేహంగా కనిపించడం వారి గుండెల్ని ముక్కలు చేసింది.నగరం మండలం తాడివాక వారి పాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దాసరి విజయరాజు-అనిత ల కుమారుడు దాసరి అఖిల్ (15) ముత్తుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం రోజువారీలా స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన అఖిల్ స్నేహితుడితో కలిసి గ్రామ చెరువుకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఆడుతూ పాడుతూ గడిపే వయసులో ఆ నీళ్లు అతని జీవితాన్ని మింగేశాయి.ఈత కొడుతుండగా అఖిల్ అకస్మాత్తుగా లోతులోకి జారిపోవడంతో తోడుగా ఉన్న స్నేహితుడు జస్వంత్ ప్రాణాపాయంలో ఉన్న అఖిల్‌ను రక్షి ంచేందుకు యత్నించినా సాధ్యం కాలేదు. భయంతో గ్రామానికి పరుగెత్తి సమాచారం ఇవ్వగా గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకునే సరికి అఖిల్ మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. ఆ దృశ్యం చూసిన వారంతా కళ్లకు నమ్మలేకపోయారు.ఇప్పుడే మా ముందు నవ్వుతూ వెళ్లాడు ఇలా ఎలా అయ్యాడు అంటూ తల్లిదండ్రులు విలపించిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. చిన్న వయసులోనే కుటుంబానికి ఆధారం అవుతాడని ఆశలు పెట్టుకున్న అఖిల్ ఇంత త్వరగా దూరమవడం గ్రామాన్ని విషాదంలో ముంచేసింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యావరణ నిబంధనలు బేఖాతరు

- విశాఖ డేటా సెంటర్ పై హైకోర్టులో ఫిర్యాదు

**విజయవాడ, సెప్టెంబరు 30 (ప్రభాతవార్త):** విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వైజాగ్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్పర్యావరణ అంశాలను తుంగలో తొక్కుతున్నాయంటూ జనసేన మాజీ నాయకులు జల బిరాదరి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ వేసిన కేసును హైకోర్టు స్వీకరించింది. ఎఐ డేటా సెంటర్ నిర్మాణంలో ప్రభుత్వం, వైజాగ్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్ (అదానీ-గూగుల్ ఎస్ పీ వీ), సంబంధిత నియంత్రణ సంస్థలు పూర్తిగా విస్మరించాయని సదరు అంశాలను పిటిషనర్ హైకోర్టు దృష్టికి తీసుకువెళ్ళారు. విశాఖపట్నంలోని అడవివరం- ముడసర్లొవ ప్రాంతంలో ప్రతిపాదించిన 1 జీడబ్ల్యూ హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టుకు సంబంధించి, చట్టపర మైన, పర్యావరణ మరియు దేవాదాయ భూముల అంశాలపైనా పిటిషనర్ బొలిశెట్టి సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సమగ్ర రీజాయిండర్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ రీజాయిండర్‌లో, సంబంధిత రికార్డులు మరియు పత్రాల ఆధారంగా ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలను కోర్టు పరిశీలనకు తీసుకువచ్చారు. ఈ ఘటనలో దేవాదాయ భూ ముల కేటాయింపుపై అభ్యంతరాలను హై కోర్టు దృష్టికి తీసుకు వెళ్ళాము. డేటా సెంటర్లకు వ్యతి రేకం కాదు, కానీచట్టాల అమలు ముఖ్యం. విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల పర్యావ రణ పరిరక్షణ మరియు జీవించే హక్కును కాపా డటానికి చట్టాల కఠినమైన అమ లును కోరుతున్నామని పిటిషనర్ పేర్కొన్నారు.

**సింహాచలం దేవస్థాన భూముల కేటాయింపులో జరిగిన అక్రమాలు:** శ్రీ వరా హ లక్ష్మీ ్మనరసింహా స్వామి దేవస్థానానికి చెందిన 160 ఎకరాల (అడవివరం సర్వే నెం. 275లో 153 ఎకరాలు, ముదసలోవ సర్వే నెం. 26లో 7 ఎకరాలు) భూమిని కేటాయించడంలో నిబంధ నలు ఉల్లంఘించబడ్డాయని ఆరోపించారు. **పర్యావరణ ప్రభావ అంచనాలో లోపాలు:** 1 గిగావాట్ (1000 మెగావాట్లు) డేటా సెంటర్ ప్రాజెక్ట్ మూడు వేర్వేరు ప్రాంతాలలో విస్తరించి ఉంది, ఇది కేటగిరీఏ ప్రాజెక్ట్ కింద కేంద్ర ప్రభుత్వం చేత మదింపు చేయబడాలన్నారు.

## నెల్లూరు కార్పొరేషన్‌ను దోచుకుంటున్న మంత్రి నారాయణ

- చెత్త సేకరణ పేరుతో రూ.20 కోట్ల అవినీతి
- విలేకరుల సమావేశంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిల ధ్వజం



**నెల్లూరు,సెప్టెంబరు 30 ప్రభాతవార్త-విద్య:**నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కనుసన్నల్లోనే బడ్జెట్ అంచనాలను అడ్డగోలుగా పెంచేసి, ప్రజల మెడపై కత్తిపెట్టి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తూ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో దోపిడీకి పాల్పడుతున్నారని వైయస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలు ధ్వజమెత్తారు. బుధవారం నగరంలోని స్థానిక పొదలకూరురోడ్డు లోని వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భగా వారు మాట్లడుతూ టెండర్లు పిలవాల్సిన అవసరం లేకుండా పనులను రూ.4.90 లక్షల బాటా రేట్లుగా విభజించి సొంత మనుషులకు కట్టబెడుతున్నారని, చెట్లు, చెత్త, వాహనాల నిర్వహణ, కాంపాక్టర్లు, బస్సుల పేర్లతో రోజుకో కుంభకోణానికి తెర లేపారని అరోపించారు. ఈ మేరకు నెల్లూరు కార్పొరేషన్ బడ్జెట్ పుస్తకాలు, టెండర్ ప్రతులు, ఎజెండా కాపీలను ఆధారాలతో సహా చూపిన వారు, అన్ని ఆధారాలతో నిలదీస్తున్నా సమాధానం చెప్పకుండా మంత్రి నారాయణ పారిపోతున్నారని ఏదేవా చెసారు. 2019 నుంచి మున్సిపల్ బడ్జెట్ రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు బయటకి వస్తాయని, వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.44 కోట్ల నుంచి రూ.66 కోట్ల వరకు ఉన్న వార్షిక పన్నుల వసూళ్లను, కూటమి ప్రభుత్వం రాగానే నారాయణ ఆధ్వర్యంలో గతేడాది రూ.111 కోట్లు వసూలు చేసి, ఈ ఏడాది ఏకంగా రూ.154 కోట్లకు టార్గెట్ పెంచారన్నారు. పన్నులు కట్టలేదని సామాన్యులను, రేకుల ఇళ్లలో ఉండే నిరుపేదలను లోక్ అదాలత్‌లకు, కోర్టులకు పిలిపించి వేధిస్తున్నారని, మంచి నీటి పన్నును రూ.7 కోట్ల నుంచి ఏకంగా రూ.30 కోట్లకు పెంచేయటం దారుణమన్నారు. క్లాప్ ఆటోలు నిలిపేసి మంత్రి అనుచరుల ట్రాక్టర్లతో చెత్తసేకరణ నెపంతో రూ.20 కోట్ల దోపిడీకి పాల్పడటం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌గారి హయాంలో క్లాప్ ఆటోలకి 95 ఆటోలకు నెలకు రూ.58.90 లక్షలు, ఏడాదికి రూ.7.06 కోట్లు మాత్రమే ఖర్చయ్యేది. కానీ ఈ ప్రభుత్వం రాగానే క్లాప్ వాహనాలకు అద్దె చెల్లించకుండా కుట్రపూరితంగా నిలిపివేసి, మంత్రి పి.నారాయణ అనుచరుడైన పృథ్వీరాజ్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన 126 ట్రాక్టర్లను తెచ్చి, ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.1,32,750 నెలకు రూ.1.67 కోట్లు, ఏడాదికి ఏకంగా రూ.20.07 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని. కేంద్ర నిబంధనలకు విరుద్ధంగా ఓపెన్ ట్రాక్టర్లలో చెత్తను తరలిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని అవేదన వ్యక్తం చెసారు. స్వీపింగ్ మిషన్లు, కాంపాక్టర్ల పేరిట కోట్ల రూపాయల లూటీ జరిగిందన్నారు. దమ్ముంటే మంత్రి నారాయణ బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

## మద్యం కుంభకోణం కేసులో కారుమూరికి కస్టడీ

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసులో విజయవాడ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. నిందితుడు కారుమూరిని అక్టోబర్ 5 నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరో నిందితుడు సునీల్‌ను గతంలోనే విచారించినందున, అతడి కస్టడీ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఇదే కేసులో కారుమూరి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది.

## వైద్యవిద్య స్థానికతపై సుప్రీం స్పష్టత

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్ర తినిధి:** వైద్య విద్య స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టతనిచ్చింది. తెలంగాణ స్థానికతపై ఇచ్చిన ఆదేశాలే ఏపీ విద్యార్థులకు కూడా వర్తిస్తాయని తేల్చిచెప్పింది. 9వ తరగతి వరకు ఏపీలో చదివిన విద్యార్థిని శ్రీశ్రావ్య, తనకు నీట్‌యూజీ కౌన్సిలింగ్‌లో ఏపీ స్థానికత వర్తింపజేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2024లో ఇచ్చిన ఒక ఏడాది మినహాయింపును తనకు కల్పించాలని కోరింది. అయితే ఈ రిట్ పిటిషన్‌లో జోక్యం చేటసుకునేందుకు నిరాకరించిన కోర్టు, ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది.

## బ్రహ్మోత్సవాలలో అపశ్రుతి 12 మందికి గాయాలు

**చిట్టమూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా చిట్టమూరు మండల పరిధిలోని మల్లాం గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్స వాల్లో బుధవారం అపశృతి చోటు చేసుకుంది. బ్రహ్మోత్స వాలకు భారీగా విచ్చేసే భక్తులకు భోజనం తయారు చేసే నేపథ్యంలో వంటశాలలో సాంబారు పాత్ర ప్రమాదవశాత్తు జారడంతో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ముగ్గురు వాలంటీర్లకు తీవ్ర గాయాలు కాగా 9 మంది భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మల్లాం ఆలయ ప్రాంగణంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంతో ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల మధ్య కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గాయపడిన వాలంటీర్లతో పాటు 9 మంది భక్తులను నాయుడుపేట,చెన్నై ఆసుపత్రులకు తరలించి చికిత్స ను అందించారు. నాయుడుపేట లోని శ్రీధర్ రెడ్డి హాస్పిటల్ లో చికిత్స పొందిన 9 మంది సురేష్ సాయి రెడ్డి, సుధాకర్,సాయి మోహన్,చిన్న వెంకటయ్య, దామరపు చెన్నయ్య పెనిమిటి సుబ్రహ్మణ్యం,సుబ్రమణ్యం, కత్తి రమణయ్య తదితరులు బుధవారం సాయంత్రం డిశ్చార్జ్ అవుతున్నట్లు చెన్నైలో ఉన్న మరో ముగ్గురు గురువారం ఉదయం డిశ్చార్జ్ అవుతారని స మాచారం అందినట్లు స్థానిక ఎస్సై నాగరాజు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులకు అన్నదానం నిర్వహించే క్రమంలో సుమారు 150 లీటర్ల మేర సాంబారు కలిగిన పాత్ర కొక్కేలు ఊడి పడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నప్పటికీ గాయపడిన వారు స్వల్ప గాయాలతోనే బయటపడటం ఆ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మహిమగా స్థానిక ప్రజలు చెబుతున్నప్పటికీ చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమేష్, చెన్నయ్య, మణి అనే వాలంటీర్ల పరిస్థితి కొంతమేర ఆందోళన కలిగిస్తుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఏదిఏమైనా ఆలయ కమిటీ వేలాదిమంది భక్తు లు విచ్చేసే బ్రహ్మోత్స వాల్లో ఎలాంటి లోటు పా ట్లకు తావు లేకుండా భక్తులుకీ ఇబ్బంది కలగకుండా చూడాలిని భక్తులు అభిప్రాయ పడుతున్నారు.

## అరసవల్లి అభివృద్ధికి రూ. 55.74 కోట్లు

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు

**విజయనగరం, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థాన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్2.0 పథకం కిం ద రూ. 55.74 కోట్ల నిధులు మంజూరు చేయడంపై రాష్ట్ర చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాలశాఖ మంత్రి మరియు శ్రీకాకుళం ఇంచార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల కోసం కేంద్ర స్థాయిలో ప్రత్యేక చొరవతో కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు జిల్లా ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధులతో చేసే అభివృ ద్ధితో జిల్లాలోని అరసవల్లి రానున్న రోజులలో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విరాజిల్లబోతుందన్నారు. సూర్య దేవాలయ ప్రాధాన్యతను గుర్తించి నిధులు విడు దల చేసిన విశ్వ గురుగా ఖ్యాతి పొందిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శెకావత్, రాష్ట్ర ప్రజల అలాగే ప్రాంతాలవారీగా ప్రజల మనోభావాలకు, ఆధ్యా త్మికతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్ప టికే ఉత్తరాంధ్ర మణి కిరీటంగా భోగాపురం అంత ర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావటంతో రానున్న రోజులలో దేశ విదేశాల నుంచి అరసవల్లి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని ఈ నిధులతో దేవాలయం మరింత అభివృద్ధి చెంది ప్రాచుర్యం పొందుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ముగిసిన మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సు



**విజయవాడ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** రాష్ట్రరాజధాని అమరావతిలో రెండురోజులపాటు జరి గిన ఐగాట్ మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల తొలి ప్రాంతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. విజయవాడలోని అంబేద్కర్ భవనంలో జరిగిన ఈకార్య క్రమంలో బుధవారం పౌరసే వలు, ప్రజా పాలనలో ఏఐ సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పై ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పి యూష్‌కుమార్ ప్రసంగించారు. ఏఐ విని యోగంతో వేగవంతమైన పారదర్శక సేవలు అందించేలా తీసుకున్న చర్యలను వివరించారు. ఏఐ వినియోగం పెరిగనప్పటికీ నిర్ణయాధి కారంలో మానవ విచక్షణే కీలకమని ఆయన పేర్కొన్నారు. నిబంధనలు అమలు చేసే స్థాయి నుండి సమస్యల పరిష్కారం దిశగా అధికారులు కృషిచేయాలన్నారు. వాణిజ్య పన్నులశాఖలో మల్టీ ఏజెంట్ నెట్‌వర్క్ ప్రయోగం విజయవంతం అయ్యిందని, రూ.1,600కోట్ల విలువైన 5వేల ఎసెస్‌మెంట్ కేసులను ఏఏఐతో విశ్లేషించినట్లు తెలిపారు. ఉద్యోగులతోపాటు యువతను సాంకేతిక సవాళ్ళకు సిద్ధం చేయాల్సి ఉందని ఆయన అభిప్రయాపడ్డారు. ఉద్యోగుల సామర్థ్యాలను పెంపునకు కీలక అంశాలతో ముసాయిదా రూపొందించిన ప్రాంతీయ సదస్సు. శిక్షణా వ్యవస్థలో ఉత్తమ విధానాలను పంచుకున్న ఆరు రాష్ట్రాల ప్రతినిధులు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

1-9pg10.qxd OK:1-9pg10.qxd 1/1/02 8:17 AM Page 1





## ఆసియా క్రీడలు రెజ్లింగ్.. సునీల్‌కు కాంస్యం

**నగోయా:** జరిగిన ఆసియా గేమ్స్ 2026 పురుషుల 87 కేజీల గ్రీకో రోమన్ రెజ్లింగ్ ఈవెంట్‌లో, భారత రెజ్లర్ సునీల్ కుమార్, ఫిలిప్పీన్స్‌కు చెందిన కాలమ్ జాన్‌స్టన్ రాబర్ట్స్‌ను 9-0 తేడాతో టెక్నికల్ సుపీరియారిటీతో ఓడించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో సునీల్ ఈ విభాగంలో వరుసగా రెండవ ఆసియా క్రీడల కాంస్య పతకాన్ని గెలుచుకోవడంతో పాటు, ఖండాంతర క్రీడలలో రెండు గ్రీకోరోమన్ రెజ్లింగ్ పతకాలను గెలుచుకున్న తొలి భారతీయ రెజ్లర్‌గా నిలిచాడు.

ఆట ప్రారంభంలోనే రాబర్ట్స్‌ను రెండుసార్లు కింద పడేసి నాలుగు పాయింట్లు సాధించిన సునీల్, వెంటనే ఆటపై పట్టు సాధిం చాడు. నిష్క్రియాత్మకతకు లభించిన మరో పాయింట్‌తో అతని ఆధిక్యం త్వరలోనే 5-0కి పెరిగింది, దీంతో తొలి 90సెకన్లలోనే సునీల్ తిరుగు లేని ఆధిక్యాన్ని నెలకొల్పాడు. సునీల్ దాడులను ఎదుర్కోవడానికి రాబర్ట్స్ చాలా ఇబ్బంది పడ్డాడు. సునీల్ మరో స్కోరింగ్ మూవ్‌ను ప్రదర్శించి మరో రెండు పాయింట్లు జోడించి, స్కోరును 90కి తీసుకువెళ్ళి, టెక్నికల్ సుపీరియారిటీ ద్వారా విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. అతను ఇటీవల పతకం సాధించడంతో, ఆసియా క్రీడలలో బహుళ గ్రీకోరోమన్ పతకాలు గెలుచుకున్న మొదటి భారతీయ రెజ్లర్‌గా నిలిచాడు,

## ఆసియా గేమ్స్ హాకీ ఫైనల్స్‌కు భారత్ మహిళాజట్టు

### దక్షిణ కొరియాపై 2-0 తేడాతో విజయం

**కకమిగహార:** జపాన్‌లోని కకామిగహారాలో బుధవారం జరిగిన సెమీఫైనల్‌లో దక్షిణ కొరియాను 2-0 తేడాతో ఓడించి, స్వర్ణ పతక పోరులో స్థానం సంపాదించిన భారత్, ఆసియా క్రీడలు 2026 మహిళల హాకీలో పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలి క్వార్టర్‌లో భారత్‌కు పలు పెనాల్టీ కార్నర్లు లభించినా వాటిని గోల్స్‌గా మలచలేకపోయింది. కొరియా రెండు వైపుల నుంచి దాడికి దిగినా, భారత్ పటిష్టంగా నిలవడంతో తొలి పావుగంట గోల్ లేకుండా ముగిసింది. రెండవ క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్ ద్వారా లభించిన శక్తివంతమైన షాట్‌ను నవనీత్ కొట్టగా, కొరియా గోల్ కీపర్ అద్భుతంగా దాన్ని అడ్డుకోవడంతో భారత్ మరోసారి గోల్‌కు చేరువైంది. భారత్ నుండి నిరంతర ఒత్తిడి ఎదురైనప్పటికీ, కొరియా దృఢంగా నిలబడటంతో విరామ సమయానికి ఇరు జట్లు 0-0తో సమంగా నిలిచాయి. ఆటను పునఃప్రారంభించిన భారత్ 44వ నిమిషంలో ఇషిక గోల్ చేయడంతో ఎట్టకేలకు 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కెప్టెన్ సలీమా టెటే ప్రారంభించిన ఒక ఎత్తుగడతో నాలుగో క్వార్టర్ ఆరంభంలోనే భారత్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. ఈ విజయంతో, ఆసియా క్రీడల్లో 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించి రెండో మహిళల హాకీ స్వర్ణ పతకాన్ని సాధించాలన్న భారత ఆశలు సజీవంగా ఉన్నాయి.

## ఆసియా గేమ్స్ మహిళల ఆర్చరీ.. భారత్ టీమ్‌కు స్వర్ణం

ఆట



**నగోయా:** ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో ఏడో స్వర్ణం చేరింది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ టీమ్ ఈవెంట్‌లో భారత్ క్రీడాకారిణులు సత్తా చాటుతూ పసిడి పతకాన్ని ముద్దాడారు. బుధవారం జరిగిన ఫైనల్లో 238-234 తేడాతో జ్యోతి సురేఖ, చికితా, ప్రీతికాతో కూడిన భారత త్రయం చైనాను ఓడించింది. జ్యోతి సురేఖ వెన్నం, చికితా తనిపర్తి, ప్రీతికా ప్రదీప్‌తో కూడిన భారత జట్టు ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. కీలకమైన ఫైనల్లో ఒత్తిడిని అధిగమిస్తూ ప్రతి రౌండ్‌లోనూ చైనాపై ఆధిక్యాన్ని కొనసాగించి నెగ్గింది. ఫైనల్ పోరు ప్రారంభమైన వెంటనే భారత జట్టు తొలి ఎండ్‌లో వరుసగా పర్ఫెక్ట్ 10లు సాధిస్తూ 60-58తో ఆధిక్యం సంపాదించింది. రెండో ఎండ్‌లోనూ అదే దూకుడు కొనసాగించింది. మరోసారి 60 పాయింట్లు సాధించిన భారత జట్టు 60-58తో ఆ రౌండ్‌ను సొంతం చేసుకుంది. మూడోఎండ్ ముగిసే సమయానికి భారత్ 178-176తో ముందంజలో నిలిచింది. చివరి ఎండ్‌లో టైటిల్‌ను ఖరారు చేసుకోవడానికి భారత్‌కు మరో స్థిరమైన ప్రదర్శన అవసరమైంది. చివరిరౌండ్‌లో భారత త్రయం మొత్తం ఆరు పర్ఫెక్ట్ 10లు సాధించింది. దీంతో 238 పాయింట్లతో ఫైనల్‌ను ముగించి 234 పాయింట్లకే చైనాను పరిమితం చేసింది. ఫలితంగా భారత్‌కు స్వర్ణం ఖాయమైంది.

## నేడు శ్రీలంకతో సెమీఫైనల్



**న్యూఢిల్లీ:** ఆసియా గేమ్స్ 2026లో భారత పురుషుల క్రికెట్ జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. ఒక్క మ్యాచ్ ఆడకుండానే సెమీఫైనల్ చేరిన భారత్ అక్టోబరు 1న జరిగే నాకౌట్ పోరులో శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. జపాన్‌లోని నిషిన్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు మొదలవ్వనున్న ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. వర్షం కారణంగా క్వార్టర్ ఫైనల్స్ రద్దయిన సంగతి తెలిసిందే. సెమీఫైనల్ కూడా రద్దయితే మెరుగైన ఐసీసీ ర్యాంక్ కలిగిన భారత్ ఫైనల్ చేరనుంది. శ్రీలంక కాంస్య పోరు ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ మ్యాచ్ జరిగినా, భారత్‌కే విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శ్రీలంకతో పోల్చితే భారత జట్టే హాట్ ఫేవరేట్. కానీ స్పిన్ కండిషన్స్‌లో శ్రీలంకను తక్కువ అంచనా వేయలేం. ఈ క్రమంలోనే టీమిండియా కాంబినేషన్ ఎలా ఉంటుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కుతుందా లేదా బెంచ్‌కే పరిమితం చేస్తారా అనేది చూడాలి. జపాన్‌తో ఏకైక టి20లో వైభవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయగా, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చారు. జపాన్ కండిషన్స్ స్పిన్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఈ క్రమంలోనే స్పిన్ బాగా ఆడగల సంజూ శాంసన్‌నే తుది జట్టులో కొనసాగించే అవకాశం ఉంది. దాంతో వైభవ్ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది. సెలక్టర్లు ఏం నిర్ణయం తీసుకుంటాడో చూడాలి.



## ఆసియా క్రీడల షూటింగ్.. మిక్స్‌డ్ టీమ్ నీరు, కైనాస్‌కు స్వర్ణం

**నగోయా:** ఆసియా గేమ్స్ 2026 ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో బుధవారం భారత షూటర్లు నీరూ ధండా-కైనన్ చెనాయ్ ద్వయం స్వర్ణం కైవసం చేసుకుంది. తద్వారా కొత్త ఆసియా రికార్డును నెలకొల్పి, భారతదేశ షూటింగ్ పతకాల ఖాతాకు మరో టైటిల్‌ను చేర్చారు. ఫైనల్‌లో భారత్‌కు ఆరంభం కష్టంగా సాగింది. తొలి 10 షాట్లలో కేవలం ఆరు మాత్రమే సాధించి పట్టికలో అట్టడుగున నిలిచింది. అయితే, రెండో సిరీస్‌లో నీరూ, కైనాన్ విజయవంతమైన షాట్‌ల పరంపరను కొనసాగించారు. వారి ప్రదర్శనతో 20 షాట్‌ల తర్వాత భారత్ 16 హిట్‌లు సాధించి, ఖతార్‌తో సమంగా నిలిచింది. 12 హిట్‌లతో ఇరాన్ నిష్క్రమించడంతో భారత్ పోడియంపై స్థానం దక్కించుకుంది. మరో క్లీన్ సిరీస్‌తో భారత్ గట్టి పోటీలో నిలవగా, చివరిలో బలమైన ప్రదర్శనతో ఈ జంట 30 షాట్ల దశలో 26 హిట్లు సాధించింది. బలంగా ప్రారంభించిన చైనా 23 హిట్లతో నిష్క్రమించగా, ఖతార్ 24 హిట్లతో భారత్‌కు ప్రధాన పోటీదారుగా నిలిచింది. నిర్ణయాత్మక దశలో నీరు, కైనన్ 34 హిట్‌లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మంగళవారం మహిళల వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లో రజత పతకం సాధించిన తర్వాత, బుధవారం మిక్స్‌డ్ టీమ్‌లో నీరుకు ఇది రెండవ స్వర్ణ పతకం.





## ఆసియా క్రీడల బాక్సింగ్.. ఫైనల్‌కు లవ్లీనా , కపిల్‌కు కాంస్యం

**నిషోయ్:** ఆసియా గేమ్స్ 2026లో జరిగిన మహిళల 75 కేజీల బాక్సింగ్ విభాగంలో, భారత బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ ఫైనల్‌కు దూసుకెళ్లగా, పురుషుల 90 కేజీల సెమీఫైనల్ పోరులో కపిల్ పోఖరియా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బుధవారం జరిగిన సెమీఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన నటాల్యా బోగ్దనోవా తొలి రౌండ్‌లో క్రమంగా తన దాడులను తీవ్రతరం చేయగా, లోవ్లినా తన ప్రత్యర్థిని ఎదుర్కోవడంపై దృష్టి సారించింది. దీంతో కజఖ్ బాక్సర్ మొదటి రౌండ్‌లో 3-2 తేడాతో స్వల్ప ఆధిక్యం సాధించింది. రెండవ రౌండ్‌లో లవ్లినా దూకుడుగా ఆడింది. లవ్లినా పదునైన పంచ్‌లతో ఆ రౌండ్‌ను 5-0తో గెలుచుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. లోవ్లినా తన ఆధిక్యాన్ని నిలుపుకొని 3-2 తేడాతో స్ప్లిట్‌డెసిషన్ విజయాన్ని సాధించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఇక పురుషుల 90కేజీల విభాగంలో కపిల్ పోఖరియా ప్రస్థానంసెమీఫైనల్స్‌లో ముగిసింది. అక్కడ అతను ఉజ్బెకిస్తాన్‌కు చెందిన తురాబెక్ ఖబిబుల్లాయెవ్ చేతిలో 1-4 తేడాతో ఓటమి చవిచూశాడు. తొలి రౌండ్‌లో కపిల్ ఆశాజనకంగా ప్రారంభించినా ఖబీబుల్లావ్ తొలి రౌండ్‌ను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నాడు. రెండో రౌండ్‌లోను 4-1 తేడాతో ఉజ్బెక్ ఆధిక్యంతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు.



## ఇవిలకు భారీ ప్రోత్సాహం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** కార్ల తయారీ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కొత్త 'కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ (సిఎఎఫ్ఇ-3) నిబంధనలను ప్రకటించింది. 2027 ఏప్రిల్ నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. 2032 మార్చి వరకు కొనసాగుతాయి. చిన్న పెట్రోల్ కార్లకు ప్రత్యేకంగా ఇవ్వాలని గతంలో ప్రతిపాదించిన రాయితీని తుది నిబంధనల్లో తొలగించారు. అదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు అందుతున్న ప్రోత్సాహకాలను కొనసాగించారు.

**చిన్న కార్లకు ప్రత్యేక రాయితీ లేదు**

909 కిలోల వరకు బరువున్న పెట్రోల్ కార్లకు కిలోమీటరుకు 3 గ్రాముల కార్బన్ ఉద్గార రాయితీ ఇవ్వాలని 2025లో రూపొందించిన ముసాయిదాలో ప్రతిపాదించారు. దీనిని పలు ప్రముఖ కార్ల తయారీ సంస్థలు వ్యతిరేకించాయి. తుది నిబంధనల్లో ఈ ప్రత్యేక రాయితీకి చోటు కల్పించలేదు. బదులుగా కంపెనీ మొత్తం కార్ల ఉద్గారాల లక్ష్యాన్ని నిర్ణయించే ఫార్ములాను మార్చారు.ఇవి కార్ల వాహనాల వినియోగాన్ని పెంచేందుకు 'సూపర్ క్రెడిట్స్ విధానాన్ని కొనసాగించారు.

**క్రెడిట్.. డెబిట్ విధానం:** కొత్త నిబంధనల్లో క్రెడిట్‌డెబిట్ వ్యవస్థను కూడా తీసుకొచ్చారు. నిర్దేశించిన ఉద్గారాల లక్ష్యం కంటే మెరుగైన పనితీరు చూపిన కంపెనీలకు క్రెడిట్లు లభిస్తాయి. లక్ష్యాలను అందుకోలేని సంస్థలకు డెబిట్లు పేరుకుపోతాయి.

## ప్రపంచంలో అత్యంత విలువైన కరెన్సీ కువైట్ దీనార్



**న్యూయార్క్, సెప్టెంబరు 30:** ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన లేదా విలువైన కరెన్సీ ఏది అని అడిగితే చాలామంది అమెరికా డాలర్, బ్రిటన్ పౌండ్ లేదా యూరో అని సమాధానం చెబుతారు. కానీ, వాస్తవానికి ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది ఓ గల్ఫ్ దేశ కరెన్సీ. అదే 'కువైట్ దీనార్'. యూనిట్ మారకం విలువ పరంగా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కరెన్సీగా ఇది రికార్డు సృష్టిస్తోంది. 2026 సెప్టెంబరు నాటి అంతర్జాతీయ మార్కెట్ గణాంకాల ప్రకారం ఒక కువైట్ దీనార్ (కెడబ్ల్యుడి) విలువ భారత కరెన్సీలో ఏకంగా రూ.311గా ఉంది. అదే సమయంలో అమెరికా డాలర్లలో దీని విలువ సుమారు 3.23 డాలర్లు. అంటే.. మూడు డాలర్ల కన్నా ఎక్కువ ఇస్తే కానీ ఒక్క కువైట్ దీనార్ రాదు. ఈ లెక్కన ప్రపంచంలో అత్యధిక యూనిట్ విలువ కలిగిన కరెన్సీగా కువైట్ దీనార్ మొదటి స్థానంలో నిలుస్తోంది. **టాప్4లో గల్ఫ్ దేశాల హవా:** ఈ జాబితాలో మధ్యప్రాచ్య దేశాల కరెన్సీలదే ఆధిపత్యం. కువైట్ దీనార్ తర్వాత రెండో స్థానంలో బహ్రెయిన్ దీనార్ (బిహెచ్‌డి)ఉంది. దీని విలువ దాదాపు రూ.255 (2.66 డాలర్లు). మూడో స్థానంలో ఒమానీ రియాల్ (ఒఎంఆర్) సుమారు రూ.249 (2.60 డాలర్లు)తో నిలిచింది. ఇక నాలుగో స్థానంలో జోర్డానియన్ దీనార్ (జెఒడి) ఉంది.దీని విలువ దాదాపు రూ.135 (1.41 డాలర్లు). రోజువారీ ఫారెక్స్ మార్కెట్ కదలికలను బట్టి ఈ ర్యాంకింగ్‌లలో స్వల్ప మార్పులు ఉంటాయి.

## భారత్‌లోకి 'యాపిల్ ప్లే ఎంట్రీ

**ముంబై, సెప్టెంబరు 30:** ఐఫోన్ యూజర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న యాపిల్ పే సేవలు ఎట్టకేలకు భారత్‌లో అడుగుపెట్టాయి. అమెరికాలో ప్రారంభమైన పదేళ్లకు పైగా నిరీక్షణ తర్వాత, టెక్ దిగ్గజం యాపిల్ తన కాంటాక్ట్‌లెస్ పేమెంట్ విధానాన్ని దేశంలో అధికారికంగా బుధవారం నుంచి అందుబాటులోకి తెచ్చింది. ఇకపై అర్హత కలిగిన ఐఫోన్, ఐప్యాడ్, యాపిల్ వాచ్ యూజర్లు తమ డివైజ్‌ల ద్వారా సులభంగా, సురక్షితంగా చెల్లింపులు చేయవచ్చు.ప్రారంభ దశలో, ఈ సేవలు కేవలం యాక్సిస్ బ్యాంక్ జారీ చేసిన వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్ కార్డులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో మరిన్ని బ్యాంకులు, ఇతర కార్డ్ నెట్‌వర్క్‌లను కూడా ఈ జాబితాలో చేర్చనున్నట్లు కంపెనీ తెలిపింది. అయితే, భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇం టర్‌ఫేస్' (యుపిఐ)తో యాపిల్ పేకు ప్రస్తుతానికి ఎలాంటి అనుసంధానం లేదని స్పష్టం చేసింది.

## వరుసగా మూడో రోజూ మార్కెట్లు పతనం

వాణిజ్యం




**ముంబై, సెప్టెంబరు 30:** ముడి చమురు ధరలు స్థిరంగా ఉండటం. అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ అధికంగా ఉండటంతో పాటు, మెటల్, ఫార్మా షేర్లలో చివరి గంటలో జరిగిన అమ్మకాల కారణంగా బుధవారం నాడు ప్రధాన స్టాక్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడవ సెషన్‌లోనూ నష్టంతో ముగిశాయి. రోజువారీ లాభాలన్నింటినీ కోల్పోయి, 30 షేర్ల బిఎస్‌సి సెన్సెక్స్ చివరి దశ అమ్మకాల ఒత్తిడితో 48.78 పాయింట్లు (0.07 శాతం) తగ్గి 72,480.29 వద్ద స్థిరపడింది. ప్రారంభంలో పెద్దగా కదలిక లేనప్పటికీ, ఆ తర్వాత సూచీ 533.16 పాయింట్లు (0.73 శాతం) పెరిగి 73,062.23 గరిష్ట స్థాయిని తాకింది. 50 షేర్ల ఎన్ఎస్ఇ నిఫ్టీ 95.75 పాయింట్లు (0.42 శాతం) తగ్గి 22,620.45 వద్ద ముగిసింది. ఈ నెలలో, బిఎస్ఇ సూచీ 4,476.98 పాయింట్లు (5.81 శాతం), నిఫ్టీ 1,459.95 పాయింట్లు (6 శాతం) మేర పడిపోయాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీలలో, ఎటర్నల్, సన్ ఫార్మా, టైటాన్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యాక్సిస్ బ్యాంక్ లాభపడిన వాటిలో ఉన్నాయి. ప్రపంచ చమురు ధరలకు ప్రామాణికమైన బ్రెంట్ క్రూడ్ 0.54 శాతం పెరిగి బ్యారెల్‌కు 103.1 డాలర్లకు చేరింది. ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం, మంగళవారం నాడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) రూ.9,980.22 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. అధిక స్థాయిలలో లాభాల స్వీకరణ, ఆ తర్వాత చమురు ధరల పునరుద్ధరణతో ఉపశమన ర్యాలీ ఊపు కోల్పోయింది. పెరిగిన ప్రపంచ బాండ్ దిగుబడులు ఒక కీలకమైన ప్రతికూల అంశంగా కొనసాగుతూ, నిరంతర రిస్క్ తీసుకునే అవకాశాలను పరిమితం చేస్తున్నాయి. మొత్తం మార్కెట్ ధోరణి అప్రమత్తంగానే ఉంది. "పెట్టుబడిదారులు ముడి చమురు ధరల గమనాన్ని, బాండ్ దిగుబడులను, ద్రవ్యోల్బణ అంచనాలను, ప్రపంచ ద్రవ్య విధానంపై వాటి ప్రభావాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నార్లు అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు. విస్తృత మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.44 శాతం క్షీణించగా, స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.34 శాతం పెరిగింది. బిఎస్ఈ రంగాల సూచీలలో, హాస్పిటల్స్ 4.97 శాతం, హెల్త్‌కేర్ 2.35 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.43 శాతం, మెటల్ 1.24 శాతం, కమోడిటీస్ 0.54 శాతం, ఎఫ్ఎంసిజి 0.35 శాతం పడిపోయాయి. రియల్టీ 1.42 శాతం, మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్ క్వాలిటీ టిల్ట్ 1.10 శాతం, మిడ్‌స్మాల్ ప్రైవేట్ బ్యాంక్స్ 1 శాతం, ప్రైవేట్ బ్యాంక్స్ సూచీ 0.66 శాతం, టెలికమ్యూనికేషన్ 0.54 శాతం పెరిగాయి.

## 'చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లలో మార్పు లేద్లు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** అక్టోబరు 1, 2026తో ప్రారంభమయ్యే త్రైమాసికానికి పిపిఎఫ్, ఎన్ఎస్‌సి వంటి వివిధ చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పు చేయకూడదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వరుసగా పదవ త్రైమాసికం పాటు ఈ రేట్లు యథాతథంగా కొనసాగుతున్నాయి. "2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అక్టోబరు 1, 2026 నుండి డిసెంబరు 30, 2026 వరకు ఉండే మూడవ త్రైమాసికంలో, వివిధ చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లు, అదే ఆర్థిక సంవత్సరపు రెండవ త్రైమాసికానికి (జులై 1, 2026 నుండి సెప్టెంబరు 30, 2026 వరకు) నిర్ణయించిన రేట్ల మాదిరిగానే కొనసాగుతాయ్ను అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సుకన్య సమృద్ధి పథకం కింద చేసే డిపాజిట్లపై 8.2శాతం వడ్డీ లభిస్తుంది, అలాగే మూడవ త్రైమాసికంలో మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్ పై వడ్డీ రేటు 7.1 శాతంగా కొనసాగుతుంది. ప్రజా భవిష్య నిధి (పిపిఎఫ్), పోస్ట్ ఆఫీస్ పొదుపు డిపాజిట్ పథకాలపై వడ్డీ రేట్లు వరుసగా 7.1 శాతం, 4 శాతంగానే కొనసాగుతాయి. కిసాన్ వికాస్ పత్రపై వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంటుంది. ఈ పెట్టుబడులు 115 నెలల్లో మెచ్యూర్ అవుతాయి (పూర్తి కాలపరిమితిని పూర్తి చేసుకుంటాయి). నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సి) పై వడ్డీ రేటు అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో 7.7 శాతంగా కొనసాగుతుంది. ప్రస్తుత త్రైమాసికం మాదిరిగానే, మూడవ త్రైమాసికంలో కూడా మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (నెలవారీ ఆదాయ పథకం) పెట్టుబడిదారులకు 7.4 శాతం వడ్డీని అందిస్తుంది. దీంతో, ప్రధానంగా పోస్ట్ ఆఫీసులు, బ్యాంకుల ద్వారా నిర్వహించబడే చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లు వరుసగా 10వ త్రైమాసికం పాటు మారకుండా ఉన్నాయి. ప్రభుత్వం చివరిసారిగా 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో కొన్ని పథకాల వడ్డీ రేట్లను సవరించింది.

## 'నో యుపిఐ డ్లే ఉపసంహారణ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం అనంతరం, అక్టోబరు 2వ తేదీని 'యుపిఐ రహిత దినం' (నోయుపిఐ డే)గా పాటించాలన్న తమ పిలుపును ప్రముఖ వ్యాపార సంఘాలు ఉపసంహరించుకున్నాయి. రూ. 2,000 పైబడిన వ్యాపారుల యుపిఐ లావాదేవీలపై ప్రతిపాదిత 0.4 శాతం రుసుముపై ఆందోళన వ్యక్తం చేయడానికి, వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 20 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం బుధవారం ఆర్థిక మంత్రిని కలిసింది. ఈ చర్య చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై భారాన్ని పెంచుతుందని, వ్యాపారులలో డిజిటల్ చెల్లింపుల స్వీకరణను ప్రభావితం చేస్తుందని వ్యాపారులు తెలిపారు. ఈ బృందానికి చాందినీ చౌక్ పార్లమెంట్ సభ్యుడు, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సిఎఐటి) సెక్రటరీ జనరల్ అయిన ప్రవీణ్ ఖండేల్వాల్ నాయకత్వం వహించారు. ప్రతినిధులు ప్రతిపాదిత రుసుముపై స్పష్టత కోరారు. వ్యాపార వర్గాల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, వ్యాపారులు లేవనెత్తిన ఆందోళనలకు తగిన ప్రాధాన్యత ఇస్తామన్న నిర్మాణాత్మక చర్చలు, హామీల అనంతరం ఈ నిర్ణయం తీసు కున్నట్లు ఖండేల్వాల్ తెలిపారు. ఈ చర్చలతో వ్యాపార వర్గం ప్రోత్సాహం పొందిందని, ఈ విషయంపై ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగిస్తుందని ఆయన అన్నారు. నిరసనను ఉపసంహరించు కున్నప్పటికీ, రూ. 2,000 పైబడిన అర్హత కలిగిన మర్చంట్ యుపిఐ లావాదేవీలపై ప్రతిపాదిత 0.4 శాతం రుసుము అక్టోబరు 15 నుంచి అమల్లోకి రానుంది. కొత్త ఛార్జీని అమలు చేసేలోపు తమ ఆందోళనలను పరిష్కరిస్తారని తాము ఆశాభావంతో ఉన్నామని వ్యాపార సంఘాలు తెలిపాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.